సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



టిప్పర్ ఢీకొని ఇద్దరి దుర్మరణం

విజయనగరం కె.ఎల్.పురం వద్ద మంగళ వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. - IIలో



అన్ని గ్రామాలకూ తాగునీరు

ఎస్.కోట నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తాగునీటి సరఫరాకు జేజేఎం పనులు చేపట్టారు. - IIలో

22,23 తేదీల్లో దేహదారుఢ్య పరీక్షలు

విజయనగరం క్రైమ్: పోలీస్ నియామక ప్రక్రియలో భాగంగా విశాఖ జోన్‌కి చెందిన ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు విశాఖపట్నంలోని కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో మరోసారి ఈ నెల 22, 23 తేదీల్లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని విశాఖ రేంజ్ డీఐజీ కె.హరికృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులు 22న, పురుషులు 23న హాజరుకావాలన్నారు.

సర్కారు బడుల్లో.. డిజిటల్ బోధన

- బైజూస్ ట్యాబ్‌లు సిద్ధం
- వరుసగా రెండోఏడాది పంపిణీకి చర్యలు
- 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు
- గతేడాది పంపిణీ చేసిన ట్యాబ్‌లు 11,852
- ఈ ఏడాది 9,898 మందికి ట్యాబ్‌ల అందజేతకు ఏర్పాట్లు



ట్యాబ్‌లతో పార్వతీపురం మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాల బాలికలు, టీచర్లు (ఫైల్)

పార్వతీపురం టౌన్:

సర్కారు బడుల్లో చదుకునే విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీపడేలా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తెచ్చింది. పాఠ్యాంశాలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా బైలింగ్విస్ పద్ధతిలో పుస్తకాలను ముద్రించింది. మరో వైపు బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు, వారికి బోధించే ఉపాధ్యాయులకు అందజేస్తోంది. వరుసగా రెండో ఏడాది కూడా ట్యాబ్‌ల పంపిణీకి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. గతేడాది పార్వతీపురం మన్యం జిల్లాలోని విద్యార్థులు, టీచర్లకు కలిపి మొత్తం 11,852 ట్యాబ్‌లను పంపిణీ చేసింది. దీనికోసం రూ.35.23 కోట్లు ఖర్చు చేసింది. ఈ విద్యా సంవత్సరంలో దాదాపు రూ.34 కోట్ల ఖర్చుతో 9,898 మందికి ట్యాబ్‌ల పంపిణీకి సన్నాహాలు చేస్తోంది. బైజూస్ ట్యాబ్‌ల కొనసాగింపుగా పాఠశాలల్లో ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్, స్మార్ట్ టీవీల్లో కూడా బైజూస్ కంటెంట్ చూపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి ట్యాబ్‌ను కూడా మూడేళ్ల వారంటీతో కొనుగోలు చేయనుంది. విద్యార్థులు ట్యాబ్‌లు ఉపయోగించే క్రమంలో అనుకోని పక్షంలో జరిగే స్క్రీన్ డ్యామేజీకి కూడా ప్రభుత్వమే రిపేరీ చేయించాలని నిర్ణయించింది.

జిల్లాలో రెండో సంవత్సరం ట్యాబ్‌ల పంపిణీ ఇలా..			
మండలం	ట్యాబ్‌ల సంఖ్య		
బలిజిపేట	460	కురుపాం	755
భామిని	551	మక్కువ	502
గుమ్మలక్ష్మీపురం	857	పాచిపెంట	713
గరుగుబిల్లి	413	పాలకొండ	509
జియ్యమ్మవలస	463	పార్వతీపురం	1094
కొమరాడ	601	సాలూరు	1103
		సీతంపేట	988
		సీతానగరం	417
		వీరఘట్టం	472

డిజిటల్ అసిస్టెంట్లు ప్రతినెలా పాఠశాలల సందర్శన

విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ బాధ్యతలను డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం అప్పగించింది. డిజిటల్ అసిస్టెంట్లు ప్రతినెలా కనీసం ఒక్కసారి ప్రతి పాఠశాలనూ సందర్శించి ట్యాబ్‌లు పనితీరును చెక్ చేస్తారు. ట్యాబ్ రిపేరీ బాధ్యతలు కూడా వారే చూస్తారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రతివారం పాఠశాలను సందర్శిస్తారు. ప్రతి శుక్రవారం ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడి ట్యాబ్‌లకు వైఫై కనెక్ట్ చేసి వినియోగ వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తారు.

ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకునేలా..

ట్యాబ్‌లను దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వం 'టెక్నోరో' అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ భాగస్వామ్యంతో ట్యాబ్‌లో యూట్యూబ్, కెమెరా, ఇతర యాప్‌లు ఓపెన్ కాకుండా చర్యలు చేపట్టింది. మూడు యాప్‌ల(వైఫై, బైజూ స్, డిక్షనరీ)ను అందుబాటులో ఉంచింది. అప్‌డేట్ చేయడానికి ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలకు, పాఠశాల హెచ్‌ఎంలు, యాక్టివ్ టీచర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి పాఠశాల స్థాయిలోనే అప్డేట్ చేయిస్తున్నారు. అప్డేట్ చేసే క్రమంలో ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.

మరమ్మతులకు స్పెషల్ డ్రైవ్



బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లు మరమ్మతులకు రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు ఈనెల ఒకటి నుంచి జిల్లాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. స్క్రీన్ రిపేరీ ఉంటే దాదాపు రూ.6వేలకు పైగా ఖర్చు వస్తుంది. ఈ మొత్తం కూడా ప్రభుత్వమే భరించనుంది. వినియోగంపై తరచూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– కె.దేవిశ్రీ, బైజూస్ ట్యాబ్‌ల నోడల్ అధికారి

పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తున్నాం



విద్యార్థులకు పూర్తిస్థాయిలో ట్యాబ్‌ల పంపిణీకి చర్యలు చేపట్టాం.ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ట్యాబ్‌లు పంపి ణీ చేయాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు పంపిణీ పూర్తి చేస్తాం. ట్యాబ్‌లపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

– రామకృష్ణ, బైజూస్ ట్యాబ్‌ల నోడల్ అధికారి

చదువుకు సాయం



ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు డిసెంబర్‌లోగా ట్యాబ్‌లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా విద్యార్థులకు ఉపయోగపడేలా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేస్తోంది. గతేడాది పంపిణీ చేసిన ట్యాబ్‌లపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంది. విద్యార్థులకు చాలా ఉపయోగపడుతున్నాయి.

– ఎస్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

న్యూస్‌రీల్

రాయితీపై సోలార్ రైస్‌మిల్

సీతంపేట: ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి పండించే రైతులకు 35 శాతం రాయితీపై సోలార్ రైస్‌మిల్ యూనిట్‌ను మంజూరు చేస్తున్నట్టు జిల్లా ఉత్యానవన శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటివద్దనే ఓ షెడ్‌లో సులభంగా ధాన్యంను మరపట్టించి బియ్యంగా మార్చవచ్చన్నారు. షెడ్డు కట్టుకునేందుకు మరో 35 శాతం రాయితీపై రుణం అందజేస్తామని తెలిపారు. రైస్‌మిల్ యూనిట్ విలువ రూ.7,95,000 కాగా, రైతుకు 2,79,000 రాయితీ వర్తిస్తుందన్నారు. రూ.79వేలు చెల్లించి యూనిట్ పొందవచ్చన్నారు. మిగిలిన రూ.4లక్షల 20వేలు బ్యాంకు నుంచి రుణం రూపంలో సమకూరుతుందని, వడ్డీతో 60 నెలల్లో కట్టుకునే వెసులబాటు ఉందన్నారు. రూ.8,37,000 విలువచేసే సోలార్ బ్యాటరీ, ఇన్వెర్టర్లను టాటా ట్రస్టు ఉచితంగా సమకూర్చుతుందన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, ట్రైబల్ వెల్ఫేర్, హౌసింగ్ అధికారులతో వివిధ అభివృద్ధి పనులపై ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. తాగునీటి వసతి కల్పన పనులు తొలుత పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ జియో ట్యాగింగ్, వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో క్లోరినేషన్ పనులను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రోడ్ల పనులు పూర్తిచేయాలని సూచించారు. ఏకలవ్య భవన నిర్మాణ పనులు, కేరాసింగి, హడ్డివాడ, చందనగిరి గ్రామాల రోడ్లు, టూరిజం నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఈఈలు రాధారాణి, సింహాచలం, డీఈలు లోకనాథం, సిమ్మన్న, ఢిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నెడ్‌క్యాప్ డీఎమ్‌కు ఉద్యోగోన్నతి



ఐ.వి.సుబ్రహ్మణ్యం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాల నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ ఐ.వి.సుబ్రహ్మణ్యంకు ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు సంస్థ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతితో పాటు రెండు జిల్లాల బాధ్యతలు యథావిధిగా నిర్వహించాలని ఆదేశించారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎక్కువసార్లు వస్తున్న అర్జీలను పక్కాగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వస్తున్న అర్జీలపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. అర్జీ పరిష్కారంలో అర్జీదారు తృప్తి చెందాలన్నారు. అనవసరపు ఎండార్స్‌మెంట్లు ఇవ్వరాదని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో జె.వెంకటరా వు, ఆర్డీఓ కె.హేమలత, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి మల్లి కార్జున్, హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ టి.రమేష్, డీపీఆర్ ఓ బి.సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నుంచి పాలన హర్షణీయం



హనుమంతు లజపతిరాయ్

విజయనగరం అర్బన్: విశాఖపట్నం నుంచి రాష్ట్ర పాలన చేపట్టాలని క్యాబినెట్ నిర్ణయించడం హర్షణీయమని నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ (జేఏసీ) పరిపాలనా వికేంద్రీకరణ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతి రాయ్ అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దసరా నుంచి విశాఖ నుంచే పరిపాలన కొనసాగించాలని క్యాబినేట్ నిర్ణయించడంతో వెనుకబడిన ఉత్తరాంధ్ర తొందరగా అభివృద్ధి చెందుతుందని బుధవారం ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. విశాఖ పరిపాలన రాజధానిగా కావడం అత్యంత అవసరమని తెలిపారు. క్యాబినెట్ నిర్ణయం గతంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణ కమిటీ ఆధారంగా జరిగిందని, ఇది న్యాయ సమ్మతమైనదని పేర్కొన్నారు. త్వరలోనే సుప్రీం కోర్టు కూడా దీనిని పరిగణలోకి తీసుకుంటుందని జేఏసీ ఆశాభావం వ్యక్తంచేస్తోందన్నారు.

26న జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

పాలకొండ: తమ్మినాయుడు కళాశాల ప్రాంగణంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. జాబ్ మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్: 7993795796నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొమరాడ తహసీల్దార్‌ను కలెక్టరేట్‌కు సరెండర్

పార్వతీపురం టౌన్: కొమరాడ తహసీల్దార్ రాధాకృష్ణను కలెక్టరేట్‌కు సరెండర్ చేశారు. కొమరాడ మండల కేంద్రంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అధిక మంది తహసీల్దార్ రాధాకృష్ణ పనితీరుపై ఫిర్యాదు చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను అర్థించారు. దీనిని పరిగణనలోకి తీసుకుని తహసీల్దార్‌ను కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేశారు.

జవాన్‌ల 'స్వచ్ఛభారత్'



మక్కువ మార్కెట్‌యార్డును శుభ్రంచేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

మక్కువ: నిత్యం తుపాకీలు పట్టుకునే చేతులు చీపుర్లు పట్టాయి. మక్కువ ప్రధాన రోడ్డుతో పాటు మార్కెట్‌యార్డు ఆవరణను శుభ్రపరిచాయి. సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఆశుకుమారి ఆధ్వర్యంలో జవాన్లు బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. రోడ్లను శుభ్రపరిచారు. దుకాణదారుల్లో చెత్తపై చైతన్యం కల్పించారు. వ్యర్థ పదార్థాలను చెత్తడబ్బాల్లో వేయాలని సూచించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు.

శ్రీవారి తిరువీధి



రామతీర్థంలో శ్రీవారి తిరువీధి కార్యక్రమం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. స్వామివారికి బుధవారం ప్రాతఃకాలార్చన పూజల నంతరం యాగశాలలో ప్రత్యేక హోమాలు జరిపించారు. సాయంత్రం శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామిని పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ రామతీర్థంలో తిరువీధి జరిపారు. అనంతరం రామాలయంలోని వెండి మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీకాతో వ్యాధులు దూరం



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్‌మోహనరావు

పార్వతీపురంటౌన్: వ్యాధినిరోధక టీకాలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు తెలిపారు. పార్వతీపురం 13వ వార్డులో(బైపాస్ కాలనీ) వైద్య సిబ్బంది బుధవారం నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకాలు వేయడంపై సిబ్బందికి సూచనలిచ్చారు. టీకా ఆవశ్యకతను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. గతంలో పలు కారణాలతో టీకా పొందలేని వారికి 'మిషన్ ఇంద్ర ధనుష్' కింద ప్రతి బుధ, శనివారం టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్స్ పుష్ప, సత్తిబాబు, ఏఎన్ఎం సునీత, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాధనం దోచుకునేవారికి బుద్ధిచెప్పండి

- ప్రజలకు ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ పిలుపు
- రూ 3.50 కోట్ల వ్యయంతో నిర్మించే నవగాం–జంపరకోట రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ/పాలకొండ రూరల్: ప్రజల సొమ్ము అడ్డగోలుగా దోచేసి, వాటిని కప్పిపుచ్చుకునేందుకు అనేక కుట్రలు చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రజలకు పిలుపునిచ్చారు. పాలకొండ మండలం నవగాం సెంటర్ నుంచి జంపరకోట వరకు రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్డుపనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పూర్తయితే 14 గ్రామాలకు మార్గం సుగమం అవుతుందన్నారు. నవగాం సెంటర్ నుంచి 7.60 కిలోమీటర్ల మేర తారు రోడ్డుతో పాటు మధ్యలో కల్వర్టులు నిర్మిస్తారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం రోడ్డు అభివృద్ధి కోసం కనీసం ఒక్క రూపాయి కేటాయించలేదని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజలు పలుసార్లు విన్నవించినా అప్పటి పాలకులు స్పందించలేదన్నారు. మళ్లీ ఎన్నికలు వస్తున్నవేళ అబద్ధపు హామీలతో ప్రజల వద్దకు వస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ పేరుతో వందల కోట్ల రూపాయల ప్రజాధనం లూటీచేసిన చంద్రబాబునాయుడు ప్రస్తుతం జైలులో ఉన్నారని, ఆయనకు మద్దతుగా మరో దత్తపుత్రుడు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దన్నారు.

వైఎస్సార్ సీపీది ఒకటే మాట.. ఒకటే జెండా...

వైఎస్సార్‌సీపీది ఒకే జెండా, ఒకటే నాయకత్వమని, ఇందులో ఎటువంటి తేడా లేదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్పష్టం చేశారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా కళావతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే టికెట్ తమకే వస్తుందంటూ కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను పార్టీ శ్రేణులు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈఈ గౌరీశ్వరరావు, జేసీ జగన్నాథరాజు, పార్టీ మండలాధ్యక్షుడు కె.సూర్యప్రకాష్‌రావు, వైస్ ఎంపీపీ వి.అనీల్‌కుమార్, రాంబాబు, నాగవంశంపు కార్పొరేషన్ డైరెక్టర్ నల్లి శివప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు నీరజాచిన్నారావు, గొర్లె కృష్ణ, వెంకయ్య, వెంకటేష్, హైమావతి, శ్యామ్ సుందరరావు, పొట్నూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు
- పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో అర్జీల స్వీకరణ



గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

పార్వతీపురం టౌన్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజనుల నుంచి బుధవారం వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ఎస్టీ కమిషన్ ఎల్లవేళలా గిరిజనులకు అందుబాటులో ఉంటుందన్నారు. డీవీజీకి అందిన వినతుల్లో కొన్ని...

- పీసా చట్టం, 1/70 చట్టం, బినామీ గిరిజనులపై చర్యలు, షెడ్యూల్ ప్రాంతం చట్టాలు అమలులో నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కె.ధర్మారావు, నీలకంఠం విజ్ఞప్తిచేశారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని కోరారు.
- ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు నివారించే చర్యలు తీసుకోవాలని, అవసరం మేరకు వర్కర్ల నియామకం, సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంఘ నాయకుడు భగవాన్ కోరారు. ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.
- జీఓ నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని, ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని, అటవీ ఫలసాయాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, జీసీసీకి నిధులు పెంచాలని, గిరిజన గ్రామాలను షెడ్యూల్ 5లో చేర్చాలని గిరిజన సంఘ నాయకుడు మండంగి రమణ విన్నవించారు.
- ఐటీడీఏ పీఓ నేతృత్వంలో గిరిజనులకు ప్రత్యేకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఐటీడీఏ పాలక మండలి సమావేశం నిర్దేశిత సమయంలో నిర్వహించాలని, ఐటీడీఏ నిధులు గిరిజనుల అవసరాలకు మాత్రమే వినియోగించేలా చూడాలని ఉత్తరాంధ్ర గిరిజన సంఘం నాయకుడు బి.రంజిత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎమ్ కళాశాలలు, ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలలు, పీజీ సెంటర్, జిల్లా కో 'స్టడీ సర్కిల్' ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.
- పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని వసతి గృహాలకు 'డైట్ బిల్లులు' చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం కమిటీ తరఫున పి.సురేష్ వినతిపత్రం అందజేశారు.
- రామభద్రపురం మండలం జోగింద్రవలస గ్రామంలో సామాజిక భవనములకు విద్యుత్ సదుపాయం కల్పించాలని గ్రామ ప్రజలు కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు, జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డీవీజీకి స్వాగతం

ఎస్టీకమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుకు కలెక్టర్ నిషాంత్‌కుమార్, పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు, ఆర్డీఓ కె.హేమలత, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె శ్రీనివాసరావు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. గిరిజన సంక్షేమానికి జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు.



ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో సమావేశమైన కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీఓ తదితరులు

క్లుప్తంగా

పీడీఎఫ్ బియ్యం పట్టివేత

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామంలో పీడీఎఫ్ బియ్యం తరలిస్తుండగా సీఎస్‌డీటీ జయలక్ష్మి బుధవారం పట్టుకున్నారు. సీహెచ్.నారాయణరావు అనే వ్యక్తి గ్రామంలో లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న సమయంలో స్థానికులు సమాచారం అందించడంతో 120 కేజీలు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ చెప్పారు.

మరో కేసులో 1700 కిలోల పట్టివేత


రామభద్రపురం: ఇట్లామామిడిపల్లిలో పట్టుబడిన బియ్యంతో విజిలెన్స్ అధికారులు

రామభద్రపురం: మండలంలోని ఇట్లామామిడిపల్లి గ్రామంలో ఓ ఇంటి వరండాలో అక్రమంగా నిల్వ ఉంచిన 1700 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వారణాసి కళావతి లబ్ధిదారుల నుంచి అక్రమంగా కొనుగోలు చేసిన రూ.64,600 విలువ చేసే 1700 కిలోల పీడీఎస్ (పోర్టిఫైడ్)బియ్యం నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు గ్రామంలో తనిఖీ చేసి పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీఎస్‌డీటీ సాయికృష్ణకు అప్పగించారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్సై బి.సింహాచలం సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దాయికి జైలు శిక్ష

సంతకవిటి: మండలంలోని రామారాయపురం గ్రామానికి చెందిన భార్యాభర్తల తగాదాలో భర్త బొడ్డేపల్లి శివకు 6నెలల జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానాను కోర్టు విధించినట్లు ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు. 2017లో భర్తపైన భార్య కేసు పెట్టడంతో అప్పటి ఎస్సై కె.రామారావు నమోదు చేశారని ఎస్సై బి.లోకేశ్వరరావు చెప్పారు. ఈ కేసు బుధవారం హియరింగ్‌కు రావడంతో ఏపీపీ కిమిడి సూర్యారావు వాదనలు వినిపించారన్నారు.

వేధింపుల కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన యువతి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెంది గుణుపూరు సూర్యారావుపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ ఎస్.దుర్గా ప్రసాదరావు తెలిపారు. సూర్యారావు కొన్ని రోజుల నుంచి వెంట పడి ఇబ్బంది పెడుతున్నాడని, తనకు వస్తున్న పెళ్లి సంబంధాలు చెడగొడుతున్నాడని, తన తండ్రిపై బుధవారం ఉదయం కర్రతో దాడి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

గుణుపూరు సూర్యారావుతో పాటు కొంత మంది తన తండ్రిపై దాడి చేశారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొనగా ఆరుగురిపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: విధులు ముగించుకుని వేకువజామున ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ముగ్గురు వ్యక్తులు అడ్డగించి, కత్తితో బెదిరించి, డబ్బులు దొరక్కపోయేసరికి మొబైల్‌ను పట్టుకుని పరారైన వారిలో ఒక నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జేఎన్‌టీయూ సమీపంలో ఉన్న కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్.రవి ఈ నెల 16న విధులు ముగించుకుని వేకువజామున నడుచుకుంటూ కేఎల్‌పురంలోని ఇంటికి వెళ్తుండగా ఆర్టీఓ కార్యాలయం సమీపానికి వచ్చేసరికి పడమటి బలిజవీధికి చెందిన దుర్గాప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు అడ్డగించి తీవ్రంగా చితక్కొట్టి, డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బుల్లేకపోయేసరికి కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ లాక్కుని బైక్‌పై పారిపోయారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నిఘా పెట్టిన పోలీసులు నిందితుడు దుర్గాప్రసాద్‌ను నాగవంశంవీధి వద్ద మంగళవారం అదుపులోకి తీసుకుని, వన్‌ప్లస్ మొబైల్ రికవరీ చేశారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని, త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹136	₹242	₹ 252

టిప్పర్ ఢీకొని ఇద్దరి దుర్మరణం


ప్రమాదస్థలంలో రోడ్డుపక్కకు తుళ్లిపోయిన బైక్

• మరొకరి పరిస్థితి విషమం


జక్కువ నుంచి బయలుదేరుతూ మిత్రులు తీసుకున్న సెల్ఫీ


మృతుడు భోగిన సత్యనారాయణ


లచ్చిరెడ్డి రాజు మృతదేహం

విజయనగరం క్రైమ్/గంట్యాడ: స్థానిక కేఎల్ పురం వద్ద మంగళవారం రాత్రి టిప్పర్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఇదే ప్రమాదంలో మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న భోగిన సత్యనారాయణ (32)కు మగపిల్లాడు పుట్టాడు. బాబుకు బారసాల చేసేందుకు సామగ్రి కొనుగోలు కోసం సత్యనారాయణ, మిత్రులు జక్కువ గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి రాజు (25), బొడ్డు గౌరీశంకర్‌లు మంగళవారం సాయంత్రం విజయనగరం వచ్చారు. సామగ్రి కొనుగోలు చేసిన అనంతరం విజయనగరంలో భోజనం చేసి, తర్వాత వారి స్వగ్రామాలకు ద్విచక్రవాహనంపై ముగ్గురూ వెళ్తుండగా ఆర్టీఓ కార్యాలయం నుంచి విజయనగరం వైపు వస్తున్న టిప్పర్ వారి బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సంఘటనస్థలంలోనే లచ్చిరెడ్డి రాజు మృతిచెందగా మిగిలిన ఇద్దరిని స్థానికులు 108లో జిల్లా కేంద్రాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో సత్యనారాయణ మృతిచెందాడు. గౌరీశంకర్‌ను మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై గోపాల్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జక్కువ, కొంపంగి గ్రామాల్లో విషాదఛాయలు

మెంటాడ మండలంలోని జక్కువ, కొంపంగి గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయా గ్రామాలకు చెందిన యువకులు జిల్లా కేంద్రంలో దుర్మరణం చెందడంతో మృతుల కుటుంబసభ్యుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది. చేతికి అందివచ్చిన కుమారులు రహదారి ప్రమాదంలో మృతి చెందారని తెలుసుకున్న కుటుంబసభ్యులు లబోదిబోమంటుంటే చూపరుల గుండె బరువెక్కింది.

బాబుపుట్టిన 16రోజులకే..

బోగిన.సత్యనారాయణ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య భవాని గజపతినగరం మండలంలోని మధుపాడ గ్రామ సచివాలయంలో మహిళాపోలీస్‌గా విధులు నిర్వహిస్తోంది. వారికి వివాహమై ఏడాది అయింది. సెప్టెంబర్ 4వతేదీన ఆ దంపతులకు బాబు పుట్టాడు.

లచ్చిరెడ్డి రాజు నేపథ్యం..

లచ్చిరెడ్డిరాజు తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో తల్లే అన్నీ తానై పెంచింది. అన్నయ్య సీతారాం, వదిన జానకితో కలిసి రాజు ఉంటున్నాడు. రాజు మరుపల్లి గ్రామంలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కుటుంబానికి సహాయంగా ఉంటున్న రాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెండంతో అన్నావదినల రోదన వర్ణనాతీతంగా ఉంది.

సెల్ఫీ హల్‌చల్

గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి బైక్‌పై వెళ్తున్నామని అందరికీ బైబై అంటూ లచ్చిరెడ్డి రాజు వాట్సాప్‌లో పెట్టిన ఫొటో జక్కువ గ్రామ యువతను విషాదంలో ముంచేసింది. బైబై అని పెట్టిన స్టేటస్ అదే మిత్రుడి చివరి స్టేటస్ అవుతుందని ఊహించలేదంటూ మిత్రులందరూ కన్నీటిపర్యంతమయ్యారు.

త్వరితగతిన ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ గోవిందరావు

• కలెక్టర్ నిషాంత్‌కుమార్

కొమరాడ: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమర్పించిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపడమే కార్యక్రమం ధ్యేయమని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం కొమరాడ మండల పరిషత్ కార్యాలయంలో ఆయన నేతృత్వంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలస్థాయిలో సమస్యలు అక్కడే పరిష్కారం కావాలని ప్రభుత్వం ధ్యేయమని చెప్పారు. కొమరాడ మండలంలో జగనన్న చెబుదాం కార్యక్రమానికి 62 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఆర్డీఓ కె.హేమలత, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డీపీఓ బలివాడ సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి సన్యాసి నాయుడు, మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్, శిశుసంక్షేమ అధికారి విజయగౌరి పాల్గొన్నారు.

అటవీ శాఖ సిబ్బందికి సహకరించండి

• జిల్లా అటవీ అధికారి జీపీపీ ప్రసూన


జిల్లా అటవీ అధికారి జీపీపీ ప్రసూన

పార్వతీపురంటౌన్: ఒంటరి ఏనుగు హరి ఏనుగుల గుంపులో కలిసిందని, మొత్తం ఏనుగుల గుంపు పార్వతీపురం రేంజ్ దుగ్గి ముంపు ప్రాంతం వద్ద ఉందని జిల్లా అటవీ అధికారి జీపీపీ ప్రసూన తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక చవితి పండగ సందర్భంగా ఏనుగుల సంచారంపై ఆయా ప్రాంతాల ప్రజలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనల బారిన పడకుండా అటవీశాఖ అప్రమత్తం చేసిందని పేర్కొన్నారు. అటవీ అధికారులు, సిబ్బంది, ట్రాకర్లు పూర్తి అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సమాచారాన్ని అందిస్తున్నారని, వారికి ప్రజలు సహకరించాలని కోరారు. వినాయక ఉత్సవాల సందర్భంగా మానవ-జంతు సంఘర్షణలు జరగకుండా ఏనుగుల జాడ ఎప్పటికప్పుడు గమనించేందుకు అటవీ సిబ్బంది సంఖ్యను పెంచడం, ప్రజలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. కొమరాడ మండలంలో ముఖ్యంగా పాతదుగ్గి, కళ్లికోట, సీమనాయుడు వలస, దలైపేట, బిత్రపాడు గ్రామాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏనుగుల సంచారంపై సంబంధిత అటవీ అధికారుల నుంచి ముందుగా సమాచారం పొందాలని ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళల్లో, వేకువ జాము వేళల్లో రహదారులపై సంచరించవద్దని, మద్యం సేవించి రహదారులపైకి రావడం, ప్రయాణించడం ప్రమాదకరం కావచ్చని హెచ్చరించారు. ఏనుగుల సంచారానికి సంబంధించిన సమాచారం అటవీ శాఖ సిబ్బందికి అందించాలని పిలుపునిచ్చారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతి


వృద్ధురాలు పైడితల్లి (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని జన్నివలస పంచాయతీ పరిధి పెదనేర్లవలస గిరిజన గ్రామానికి చెందిన వృద్ధురాలు బోయిన పైడితల్లి అదృశ్యం కాగా ఆమె మృతదేహం గురువారం లభ్యమైంది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వృద్ధురాలు పైడితల్లి భర్త ఎర్రప్ప దొరతో కలిసి ఈ నెల 8వ తేదీన కొండకెంగువ పంచాయతీ పరిధిలో గల జీలుగువలస గ్రామానికి శుభకార్యానికి వెళ్లింది. అక్కడి నుంచి భర్త అదే రోజు సొంతూరు వచ్చేశాడు. ఆమె ఆ రోజు అక్కడే ఉండిపోయి 9వ తేదీన గ్రామానికి నడకదారిన బయల్దేరింది. అయితే ఆమె ఇంటికి చేరకపోవడంతో 12 వతేదీ వరకు కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఎక్కడా ఆచూకీ తెలియరాకపోవడంతో ఈ నెల 13వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తుండగా నేర్లవలస జీలుగువలస మధ్య ఎత్తైన కొండ ప్రాంతంలో బుధవారం ఓ మహిళ మృతదేహం పశువుల కాపర్లకు కనిపించింది. ఈ సమాచారం మేరకు ఎస్సై సురేంద్రనాయుడు సిబ్బందితో వెళ్లి పరిశీలించి ఆ మృతదేహాన్ని అదృశ్యమైన పైడితల్లిదిగా గుర్తించారు. మృతదేహం వద్ద బట్టలు తడిసిపోయి ఉండడంతో పాటు రూ.1200లు చెదపట్టి ఉన్నాయి. నడకదారిన వస్తూ 50 మీటర్ల ఎత్తు కొండపై నుంచి ఆమె జారిపడిపోయినట్లు నిర్ధారించి భర్త ఎర్రప్పదొర ఫిర్యాదు చేయడంతో మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

గుర్తు తెలియని మరో వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ సమీపంలోని తుప్పల్లో సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. స్థానికుల సమాచారంతో అక్కడకు వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. మృతుని వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వెంటనే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ


గుర్తుతెలియని మహిళ మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి ఒమ్మి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన గాయాలతోపడి ఉన్న మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 19 మండల పరిధి ఒమ్మి గ్రామ సమీపంలో రాజాం-రామభద్రపురం రహదారి పక్కన తలకు గాయాలై గుర్తుతెలియని మహిళ పడి ఉంది. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించడంతో రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటిన తరువాత మృతిచెందిందని బుధవారం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు..


ఉపాధ్యాయుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: సీతంపేట మండలం బుడగరాయి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పాలకొండ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఉంటున్న ఎ.లక్షుమయ్య(58) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. సీతంపేటలో కుటుంబంతో సహా ఉండే ఆయన నాలుగు నెలల క్రితం భార్య భాగ్యలక్ష్మి మృతితో పిల్లలను తీసుకునిపాలకొండ వచ్చి కాలనీలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఇంటి వద్ద లక్షుమయ్య అపస్మారక స్థితిలో ఉన్నట్లు కుమారుడు ఖగేశ్వరరావు గుర్తించాడు. కాసేపటికి తండ్రి మరణించినట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై బి.శివప్రసాద్ మృతదేహాన్ని, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి కుమార్తె శ్రావణి ఫిర్యాదుమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ పాత్ర కీలకం

• సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ మహంతి


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: నేర పరిశోధనలో ఫోరెన్సిక్ పాత్ర నేడు అత్యంత కీలకంగా మారిందని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీకే మహంతి అన్నారు. ఈ మేరకు మండలంలోని సెంచూరియన్ వర్సిటీలో జాతీయ కాన్ఫరెన్స్ ఆన్ ఫోరెన్సిక్ ఫైండ్స్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ..ఫోరెన్సిక్ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. నేర స్థలం వద్ద ఆధారాల సేకరణపైనే నేరస్థులకు శిక్షపడే అవకాశం ఉంటుందన్నారు. బాధిత వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించడంలో ఫోరెన్సిక్ నిపుణులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. త్వరలోనే వర్సిటీలో ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ కోర్సును ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ నేర పరిశోధనలో స్పష్టమైన విధానాలను అనుసరించాలని సూచించారు. ఈ సమయంలోనే విద్యార్థులు ఎక్కువ సమయం వెచ్చించి అవగాహన పెంచుకోవాలని చెప్పారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ప్రభుత్వ సలహాదారు డాక్టర్ సురేంద్ర కుమార్ పాల్ లైంగిక వేధింపులు-పోక్సో కేసు దర్యాప్తు అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ అంకిత్ శ్రీవాస్తవ, ఫోరెన్సిక్ విభాగాధిపతులు నాగజోగయ్య, ప్రవల్లిక పాల్గొన్నారు.

మైనర్‌పై పోక్సో కేసు నమోదు

చీపురుపల్లి: అమ్మాయికి 14 సంవత్సరాలు..అబ్బాయికి 18 సంవత్సరాలు ఇద్దరూ మైనర్లే అయినప్పటికీ చాలా దూరం వెళ్లిపోయారు. పల్లె వాతావరణంలో జన్మించిన వారిని ఇన్‌స్టాగామ్ కలిపి తప్పుడు మార్గంలో నడిపించింది. అమ్మాయి కంటే అబ్బాయి నాలుగేళ్లు పెద్దవాడు కావడంతో ప్రేమ, ఇష్టం, పెళ్లి అంటూ నాలుగు మాటలు చెప్పడంతో పలుమార్లు శారీరకంగా కలిశారు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో దండించారు. తనకు మాయమాటలు చెప్పి మోసం చేశాడని తల్లిదండ్రులకు బాలిక వివరించడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై ఎ.సన్యాశినాయుడు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

జామి: మండలకేంద్రానికి చెందిన బాలికపై లైంగిదాడికి ఓ వ్యక్తి యత్నించాడు. ఈ విషయమై స్థానికులు తెలిపిన వివరాల మేరకు స్థానికుడైన ఎ.సత్తిబాబు తాగిన మైకంలో బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

అన్ని గ్రామాలకూ తాగునీరు


ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న అధికారులు

• డీఈలు గోవిందరావు, పైడిరాజు

వేపాడ: ఎస్.కోట నియోజకవర్గంలోని ప్రతి మండలంలో గల శివారు గ్రామానికి తాగునీరు అందించేందుకు జేజేఎం నిధులు రూ.90 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు ఎస్.కోట ప్రాజెక్టు డీఈ వై.గోవిందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కేఆర్‌ఎస్ పైడిరాజు తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం వేపాడ మండలంలో మూడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ట్యాంకుల ఏర్పాటుకు రామస్వామిపేట, బక్కునాయుడుపేట, చామలాడవి, దొగ్గపేట తదితర గ్రామాలను సందర్శించి అనువైన స్థలాలను పరిశీలించారు. అనంతరం వేపాడ ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జలజీవన్‌మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50శాతం నిధులు మంజూరుచేయడంతో పనులు చేపట్టేందుకు స్థలాలు పరిశీలించినట్లు చెప్పారు. ఇప్పటివరకు ఎస్‌కోట, వేపాడ మండలంలో ఐదు గ్రామాలకు ఎల్‌కోట మండలంలో కొన్ని గ్రామాల్లో తాటిపూడి నీరు పైపులైన్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం వేపాడ, కొత్తవలస మండలాల్లో మిగిలిన గ్రామాలకు అందించేందుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ట్యాంకు నిర్మాణానికి స్థలాలు పరిశీలిస్తున్నామన్నారు. వేపాడ మండలంలో మారిక గ్రామాన్ని మినహాయించి ప్రతి పంచాయతీ శివారు గ్రామాలకు తాటిపూడి నీరు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీఎస్‌ఎన్ కూర్మనాథ్ పట్నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, ప్రాజెక్టు జేఈ బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

• ఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ జె.మురళి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ మురళి

విజయనగరం రూరల్: మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామస్థాయి, స్థానిక ప్రభుత్వమైన గ్రామ పంచాయతీలకు పరిపాలనపరమైన అధికారాలను చట్టంలో కల్పించారని, దీనిలో భాగంగానే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రిఫ్రెషర్ శిక్షణ అందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీ అండ్ పీఆర్) డైరెక్టర్ జె.మురళి పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయి స్థానిక ప్రభుత్వాలకు సారథ్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు తమకున్న అథారిటీ, అధికారంతో ప్రజోపయోగమైన పనులు చేపట్టి గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. గ్రామ కంఠంలో ఇల్లు ఉన్న వారికి ఆస్తి హక్కు పత్రాలు ఇవ్వడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న స్వామిత్వ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పంచాయతీ రాజ్ చట్టం 73వ రాజ్యాంగ సవరణ, ఇతర న్యాయపరమైన అంశాలపై కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పరిపాలన పరమైన అంశాలను క్షుణ్ణంగా అవగతం చేసుకోవాలని, అప్పుడు సరైన సేవలు అందించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో కె.రాజ్‌కుమార్, ఏవో ఏవీ కామేశ్వరరావు, శిక్షణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు ఎ.దేవుడు, జయరామలక్ష్మి, రవికిరణ్, హార్ట్‌ఫుల్‌నెస్ జిల్లా కోఆర్డినేటర్, వి.ప్రసాదరావు, వాసుదేవరావు, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ

పార్వతీపురం: ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 17న జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ కార్యక్రమంపై కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాను అక్టోబర్ 17న ప్రచురిస్తామని, 17 నుంచి నవంబర్ 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సమర్పించవచ్చునన్నారు. 2024 జనవరి 1 నాటికి అన్ని అంశాలు సరిచూసి జనవరి 5నాటికి తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నామని వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ జె. వెంకట్రావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ డి.రవికుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.